ప్రజాశక్తి
శనివారం 12 అక్టోబరు 2024 5
శ్రీకాకుళం



నోడల్ అధికారిగా గోవిందరావు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి వాడకంపై పరిశీలనకు నోడల్ అధికారిగా పూజారి గోవిందరావును నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. గోవిందరావు లావేరు మండలం బుడుమూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. పాఠశాలల్లో పోలీసు శాఖ తనిఖీల సమయంలో వారితో పాటు పర్యవేక్షణ బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు...

4,594 దరఖాస్తులు

- చివరి రోజు రికార్డు స్థాయిలో 971 మంది దరఖాస్తు
- ముగిసిన గడువు
- అప్లికేషన్ల రూపంలో రూ.91.88 కోట్ల ఆదాయం
- 14న లాటరీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మద్యం దుకాణాలకు రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా 158 దుకాణాలకు మొత్తం 971 దరఖాస్తులు అందాయి. మద్యాన్ని ప్రైవేట్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం వెలువరించిన విధివిధానాల తర్వాత జిల్లా అధికారులు అక్టోబరు ఒకటో తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం తొలుత అక్టోబరు తొమ్మిదో తేదీని తుది గడువుగా పేర్కొంది. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం అప్లికేషన్ల స్వీకరణను ఈనెల 11వ తేదీ వరకు పొడిగించింది. 11వ తేదీన చేపట్టాల్సిన లాటరీ ప్రక్రియను ఈనెల 14వ తేదీకి మార్చింది. ఈనెల తొమ్మిదో తేదీ నుంచి చివరి మూడు రోజులు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈనెల తొమ్మిదో తేదీన 880 అప్లికేషన్లు, పదో తేదీన 827 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజైన శుక్రవారం అత్యధికంగా 971 మంది దరఖాస్తు చేశారు. శ్రీకాకుళం మండల పరిధిలో ఏర్పాటు కానున్న పలు దుకాణాలకు అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. మండలంలో ఏర్పాటు కానున్న 17, 18వ నంబరు దుకాణాలకు అత్యధికంగా 50 చొప్పున అప్లికేషన్లు అందాయి. రణస్థలం మండలంలోని 50వ నంబరు దుకాణం, బూర్జ మండలంలోని 41వ షాపునకు చెరో 50 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. రణస్థలంలోని 47వ నంబరు దుకాణానికి 49 దరఖాస్తులు వచ్చాయి. పలాస మండలంలో అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి.





ఎక్సైజ్ స్టేషన్ల వారీగా దరఖాస్తుల వివరాలు

జిల్లాలో 12 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు ఉండగా, శ్రీకాకుళంలో అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. 32 దుకాణాలకు అత్యధికంగా 1061 దరఖాస్తులు వచ్చాయి. ఆమదాలవలసలోని 13 షాపులకు 367 అప్లికేషన్లు చేరాయి. రణస్థలం స్టేషన్ పరిధిలో 15 దుకాణాలు కేటాయించగా 662 దరఖాస్తులు వచ్చాయి. పొందూరు పది దుకాణాలకు 353 దరఖాస్తులు, నరసన్నపేటలో 12 దుకాణాలకు 285 అప్లికేషన్లు చేరాయి. కొత్తూరులో ఏడింటికి 205 దరఖాస్తులు, పాతపట్నంలోని ఎనిమిది దుకాణాలకు 236, కోటబొమ్మాళిలోని 15 దుకాణాలకు చెరో 339 అప్లికేషన్లు వచ్చాయి. సోంపేటలో 12 షాపులకు 313, ఇచ్ఛాపురంలోని ఎనిమిది దుకాణాలకు 246 దరఖాస్తులు చేరాయి. టెక్కలిలోని 11 దుకాణాలకు 293, నరసన్నపేటలోని 12 షాపులకు 285 దరఖాస్తులు వచ్చాయి.

ప్రభుత్వానికి రూ.91.88 కోట్ల ఆదాయం

జిల్లాలోని 158 దుకాణాలకు మొత్తం 4,594 మంది దరఖాస్తు చేశారు. ఒక్కొక్కరు రూ.రెండు లక్షలు చొప్పున డిడి రూపంలో ప్రభుత్వానికి డిపాజిట్ చెల్లించారు. దీంతో దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.91.88 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో 30 మండలాల పరిధిలోని 131 దుకాణాల ద్వారా రూ.78.64 కోట్ల ఆదాయం వచ్చింది. పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు కానున్న 13 దుకాణాలకు మొత్తం 284 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తుల రూపంలో రూ.5.68 కోట్ల ఆదాయం సమకూరింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు కానున్న 14 షాపుల ద్వారా రూ.7.56 కోట్ల ఆదాయం లభించింది.

14న అంబేద్కర్ ఆడిటోరియంలో లాటరీ

మద్యం దుకాణాలకు ఈ నెల 14న లాటరీ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందుకనుగుణంగా శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో లాటరీ ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ తిరుపతినాయుడు తెలిపారు. జిల్లాలో ఉన్న 12 ఎక్సైజ్ స్టేషన్ల వారీగా లాటరీ నిర్వహించనున్నారు. అంబేద్కర్ ఆడిటోరియం సమీపంలో ఉన్న కోడి రామ్మూర్తి స్టేడియంలో ఎక్సైజ్ స్టేషన్ల వారీగా టెంట్లు ఏర్పాటు చేసి దరఖాస్తుదారులను కూర్చోబెట్టనున్నారు. స్టేషన్ల వారీగా ఆడిటోరియంలోకి పిలిచి లాటరీ తీస్తారు. గుర్తింపుకార్డులు ఉన్న దరఖాస్తుదారులను మాత్రమే లోపలికి అనుమతించనున్నారు.

దసరాకు ధరాభారం

- పెరిగిన నిత్యావసర ధరలు
- డీలాపడిన వస్త్ర వ్యాపారం



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దసరా వచ్చిందంటే పల్లెలు, పట్నం అన్న తేడా లేకుండా ప్రతి ఇంట్లో సందడే సందడి. ఆ సందడిని ధరలు దూరం చేస్తున్నాయి. పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలతో ప్రజలు అదిరి పడుతున్నారు. పిండి వంటలు చేసుకుందామంటే పప్పుల మొదలు వంట నూనెల వరకు ధరలు మండిపోతున్నాయి. దీంతో సామాన్య జనం మార్కెట్‌లో పెద్దగా ఏమీ కొనే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు ఇసుక దొరక్క భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన కార్మికులకు ఉపాధి కరువై, చేతిలో డబ్బుల్లేకుండా పోయాయి. పారిశ్రామిక, వాణిజ్య రంగాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో మధ్యతరగతి వారి పరిస్థితీ బాగాలేదు. దీంతో ప్రజల ఇళ్లల్లో పండగ కాంతులు కరువయ్యాయి.

దసరా పండగ వ్యాపారులకు నిరాశనే మిగులుస్తోంది. కొంతతకాలంగా స్తబ్దుగా ఉన్న అన్ని రంగాలు పండగ విక్రయాలపై గంపెడాశతో ఎదురుచూశాయి. పండగ వ్యాపారం నష్టాల నుంచి తమను గట్టెక్కిస్తాయని భావించినా నిరాశనే మిగులుస్తున్నాయి. దసరా పండగకు సెంటిమెంట్‌గా చాలామంది కొత్త వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. దీంతో ఆయా రంగాలన్నీ పండగ వాణిజ్యంపై దష్టి సారించాయి. ప్రధానంగా వస్త్ర వ్యాపారులకు సంక్రాంతి, దసరా ఎంతో ముఖ్యం. కానీ వస్త్ర వ్యాపారం 60 నుంచి 70 శాతం పడిపోగా, వాహన, ఎలక్ట్రానిక్ రంగాల వ్యాపారం కొంత మెరుగ్గా ఉంది.

నిర్మాణ రంగం ప్రభావం

నిర్మాణ రంగం ప్రభావం మొత్తం అన్ని రంగాలపైనా పడింది. ఇసుక పూర్తిస్థాయిలో లభించకపోవడంతో భవన నిర్మాణరంగ కార్మికులతో పాటు దాని అనుబంధ ఇతర వ్యాపారాలు పూర్తిగా కుంటుపడ్డాయి. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టైల్స్, ఉడ్, సిమెంట్ ఇలా అన్ని పరిశ్రమలు వ్యాపారం లేక అల్లాడుతున్నాయి. వాటిని నమ్ముకుని జీవిస్తున్న కార్మికులు పొట్ట నింపుకోవడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఇక ఆయా కుటుంబాలు పండగ చేసేకునే పరిస్థితి కానరావడం లేదు. కార్మికుల చేతిలో డబ్బులు ఆడితేనే దసరా పండగకు ఊపు వచ్చేది.

వాహనాల పరిసితి కాస్త మెరుగు

మిగిలిన వ్యాపారాలతో పోలిస్తే దసరా పండుగ మోటారు వాహన రంగం కాస్త తేరుకునేలా చేసింది. ప్రధానంగా ఉద్యోగులు, వ్యాపారులు వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. దీంతో ఆయా శ్రేణులకు అవసరమైన ఉత్పత్తులకు తగిన ఆదరణ కనిపిస్తోంది. వాహన, ఎలక్ట్రానిక్ రంగాలు కుదురుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు బోనస్‌లూ రావడంతో విక్రయాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ దశలో వ్యాపారం మరింత పెంచుకునేందుకు ఆఫర్ల వల విసురుతున్నారు. ఉద్యోగులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక డిస్కౌంట్లు ప్రకటించారు. అదేవిధంగా తక్కువ డౌన్‌పేమెంట్, సున్నా వడ్డీ తదితర ఆఫర్లతో ఆకట్టుకుంటున్నారు.



వంట నూనెల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్

ధరల నియంత్రణకు చర్యలు

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పట్టణంలోని రైతుబజారులో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వంట నూనెల విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికీ నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముడి సరుకుల ధరలు పెరగడంతో వంట నూనెలు ధరలు పెరిగాయని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రేట్లతో వంట నూనెలు అందించడానికి విక్రయ కేంద్రాలను ప్రారంభించిందని చెప్పారు. ప్రతి రేషన్ కార్డుదారునికి మూడు లీటర్ల పామాయిల్, ఒక లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్‌ను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పామాయిల్ ప్యాకెట్ రూ.110, సన్ ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ రూ.124కు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పక్కనే ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి భోజన నాణ్యతా ప్రమాణాలను భోజనం చేస్తున్న పలువురిని అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పాలపోలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే రవికుమార్ దర్శించుకున్నారు. అనంతరం శ్రీకాకుళానికి చెందిన భారతీ రమేష్ పాలపోలమ్మ అమ్మవారిపై రూపొందించిన పాటల సిడిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఎస్ఒ జి.సూర్యప్రకాశరావు, సివిల్ సప్లైస్ డిటి హనుమంతు మురళీమోహన్, మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, జీడి ప్రసాద్, బోర గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై చిన్నచూపు తగదు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బాలికలు విద్యావంతులుగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అకాంక్షించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆర్‌డిఒ సాయి ప్రత్యూషతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఐసిడిఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. చిన్నచూపు చూస్తుండడం సరికాదన్నారు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ బాలికలు ఉన్నతంగా చదువుకొని గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా 'ఆడపిల్లలను కాపాడుకుందాం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను సన్మానించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ శ్రీధర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, డిఐపిఆర్ఒ చెన్నకేశవరావు ఐసిడిఎస్ సిబ్బంది, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్వరితగతిన ప్లాంటేషన్ పనులు పూర్తి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.సుధాకరరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఎస్.ఎస్.ఆర్ పురం, జరజాం పంచాయతీల పరిధిలోని ప్లాంటేషన్ పనులతో పాటు ఇంకుడుగుంతలు, హౌసింగ్ పనితీరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ శతశాతం ప్లాంటేషన్ పనులు చేపట్టాలని, అదే సమయంలో క్షేత్రస్థాయిలో నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పళ్లతోటల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన ఆక్సిజన్ అందరికీ అందుతుందని, వాతావరణ సమతుల్యతకు దోహదపడుతుందన్నారు. ఇంకుడుగుంతలు పనులనూ చేపట్టినట్లయితే భూగర్భ జల వనరులు పెంపొందించడం ద్వారా నీటి కొరతను అధిగమించవచ్చని చెప్పారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడుగుంతల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన అవగాహనను ప్రజలకు కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ శోభారాణి, ఇసి, ఇతర ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలకు సన్నద్ధం

ఎమ్మెల్యే గొండు శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికలను సన్నద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. త్వరలోనే ఎన్నికలను నిర్వహించనున్నామని, ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీనిచ్చారని వెల్లడించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాటు అడ్డగోలుగా దోచుకుని ప్రజల ఛీత్కారాన్ని ఎదుర్కొన్న వైసిపి నేతలు ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టేందుకు నీతులు వల్లిస్తున్నారని విమర్శించారు. ఎవరెంత అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసునన్నారు. జగన్ మెప్పు కోసం చంద్రబాబును విమర్శించడం వైసిపి నాయకులకు ఫ్యాషన్‌గా మారిందన్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుల ప్రమాణ స్వీకారోత్సవ సభలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వంద రోజుల కూటమి ప్రభుత్వం చేపట్టిన పాలనపై మాట్లాడిన తీరు అభ్యంతరకరమన్నారు. భూ కబ్జాలతో పలాస చుట్టూ ఉన్న కొండలు మింగేసిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అవినీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి నాయకుల దుష్ప్రచారాలను నమ్మొద్దని కోరారు. జిల్లాకు ఎయిర్‌పోర్టు రావడం కల అని, మూలపేట పోర్టు పనులు ఆగిపోయాయని అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో భావనపాడు పోర్టుకు 3,500 ఎకరాల భూమిని సేకరించేందుకు చంద్రబాబు సిద్ధపడితే, అందుకు బిన్నంగా ఆ పోర్టును మూలపేట కు మార్చి 350 ఎకరాల్లో పోర్టు కడతామని చెప్పడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. 350 నుంచి 400 ఎకరాల్లో పోర్టు నిర్మాణం ఎలా సాధ్యమవుతుందో మీరే చెప్పాలన్నారు. మంత్రిగా పనిచేసిన అప్పలరాజుకు పోర్టు నైసర్గిక స్వరూపమైనా తెలుసా అని ప్రశ్నించారు. రివర్స్ వ్యవహారం చంద్రబాబు అభిమతం కాదని, అందువల్లే మూలపేట పోర్టు పాత కాంట్రాక్టర్‌నే కొనసాగిస్తూ ఐదు వేల ఎకరాల్లో పోర్టును నిర్మించేందుకు స్థల సేకరణ చేస్తున్నామన్నారు. పోర్టు అనుబంధ సంస్థల ఏర్పాటుకు, పారిశ్రామికవాడను నిర్మించేందుకు అవసరమైన వనరులను సమకూరుస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలోనే మినీ ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రతిపాదించారని, అందుకవసరమైన చర్యలు ఇప్పటికే మొదలు పెట్టారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఈనెల 14 నుంచి వారం రోజుల పాటు పల్లె పండగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీ ఇళ్ల మంజూరుకు ముందే రూ.కోట్లు కొట్టేసిన వైసిపి నాయకులు పేదలకు ఇళ్లను నిర్మించలేకపోయారని ఆరోపించారు. బిల్లుల చెల్లింపును సైతం ప్రస్తుత ప్రభుత్వం చెల్లించి వాటిని పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులకు అండగా నిలుస్తున్నామన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి రూ.32 కోట్లతో పనులు మంజూరయ్యాయని, రూ.15 కోట్లతో డ్రెయిన్లు, మరో రూ.17 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు నిర్మాణంలో గత ఐదేళ్లలో అప్పటి మంత్రి, స్పీకర్ అలసత్వం కారణంగా 130 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని, ఈ రోడ్డు నిర్మాణంలో అడ్డంకులన్నింటినీ తొలగించి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. అనంతరం రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, సింతు సుధాకర్, అంధవరపు సంతోష్, మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ, చైన్ స్నాచింగ్ కేసుల్లో నలుగురు అరెస్టు

11 తులాల బంగారం స్వాధీనం : ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు, చైన్ స్నాచింగ్, సోంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ కేసులకు సంబంధించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన రెండు కేసుల్లో సుమారు 11 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు తెలిపారు. సోంపేట పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి కేసులో నాలుగున్న తులాల బంగారు ఆభరణాలు ఒడిశాలోని బరంపురం మణప్పురం గోల్డ్ ఫైనాన్స్ సంస్థలో తాకట్టులో ఉన్నట్టు గుర్తించి వారి నుంచి సొత్తు రికవరీ కోసం నోటీసులు పంపించినట్టు తెలిపారు. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న బసవరాజు గోపాల్, కిరణ్‌కుమార్, ఉమామహేశ్వరరావు, సంధ్యను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులు సింగిల్‌గా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేస్తున్నారని తెలిపారు. గత నెల 16న కాశీబుగ్గ శివాజీనగర్‌లో బసవరాజు గోపాల్ ముందుగా రెక్కీ నిర్వహించి, అతని సూచనలతో రెండో వ్యక్తి కిరణ్ కుమార్ దోపిడికి పాల్పడ్డారు. ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళను రూమ్ అద్దెకు కావాలని మాటల్లో పెట్టి తర్వాత తాగడానికి నీరు కావాలంటూ ఆమె వెంట ఇంట్లోకి జొరబడి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు, తులం లాకెట్‌తో ఉన్న చైన్‌ను దొంగిలించాడు. అక్కడ సమీపాన ఉన్న బండూరు ఉమామహేశ్వరావు, బసవ రాజగోపాల్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై పారిపోయారు. దొంగిలించిన బంగారు ఆభరణాలను ఆ తర్వాత రోజు మద్రివలస సంధ్యతో కలిసి విశాఖ ఎంవిపి కాలనీలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.2.10 లక్షలు తీసుకున్నారు. ఇందులో రూ.10 వేలు సంధ్య తీసుకుని, మిగతా రూ.రెండు లక్షలు ఉమామహేశ్వరరావుకు ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 5న పలాసలోని కొత్తవీధిలో రెక్కీ చేసి ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళను, తిరుమల అనే పేరు గల వ్యక్తి ఉన్నారా అని అడిగి, తలుపు తీసిన వెంటనే ఆమెపై దాడి చేసి, కత్తితో బెదిరించారు. ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళల్లో ఒకరు కుర్చీతో దాడి చేశారు. ఇంతలో పక్కనే ఉన్న మహిళ మెడలో ఉన్న 2 పేకల 5 తులాల పుస్తెలతాడు, 4 తులాల నల్లపూసలు, తులం చైన్‌ను తెంపుకుని అక్కడ్నుంచి పారిపోయారు. ఈ కేసులోను ముగ్గురు నిందితులు పాల్గొన్నారు. దొంగిలించిన బంగారం విశాఖపట్నం తీసుకెళ్లి సంధ్యకు ఇచ్చేందుకు ప్రయత్నించే క్రమంలో పోలీసులకు చిక్కారని వివరించారు. సోంపేట మండలం మహదేవపురంలో గత నెల 25న ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళకు నీరు కావాలని అడిగి, ముఖానికి మాస్క్ వేసి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని మూడు తులాల పుస్తెలతాడు, నల్లపూసలు తెంపుకుని పారిపోయారని చెప్పారు. ఈ కేసులో చోరీకి గురైన బంగారాన్ని బరంపురంలోని మణప్పురంలో రూ.1.24 లక్షలకు తనఖా పెట్టినట్లు వివరించారు. క్రైమ్ అడిషనల్ ఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఈ కేసులను ఛేదించి నిందితులను పట్టుకుని సొత్తు రికవరీ చేయగలిగామన్నారు. నిందితుల్లో ఉమామహేశ్వరరావు మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత నేరస్తుడని, మిగిలిన వారిలో కిరణ్ కుమార్, గోపాల్ తండ్రీ కొడుకులని వివరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటై రూ.లక్షల్లో పోగొట్టుకున్న తర్వాత ఈరకమైన నేరాలకు వారు అలవాటుపడ్డారని వివరించారు. నిందితులను పట్టుకోవడంలో, కేసులను ఛేదించడంలో క్రియాశీలకంగా పనిచేసిన కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు, సోంపేట సిఐ బి.మంగరాజు, ఎస్ఐ బి.హైమావతి, హెడ్ కానిస్టేబుల్ గవరయ్య, షణ్ముఖరావు, కూర్మారావు, ప్రసాద్, ఉషాకిరణ్, ప్రదీప్, కిరణ్ కుమార్, కామేష్, ఈశ్వరరావును ఎస్‌పి అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

మంత్రి అచ్చెన్న విజయదశమి శుభాకాంక్షలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా ప్రజలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు, శ్రామిక వర్గాలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. రానున్న రోజులలో నవ్యాంధ్ర ప్రగతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రణాళికలు అమలు కానున్నాయని తెలిపారు. జిల్లా సాగు, తాగునీటి రంగాల అభివృద్ధికి, పల్లె ప్రగతికి తీసుకుంటున్న చర్యలన్నీ రానున్న కాలంలో సత్ఫలితాలు ఇస్తాయని ఆకాంక్షించారు. రైతుకు పంట గిట్టుబాటు ధర కల్పించేందుకు, మార్కెటింగ్ వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆలయాల్లో ప్రజలకు అవసరాలకు తగ్గట్టు మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. నగరంలోని బలగలోని బాలాత్రిపుర సుందరి కాలభైరవ ఆలయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నదీ పరివాహక ప్రాంతాల్లోని ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను ఉపేక్షించేది లేదు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఆక్రమణలను ఉపేక్షించేది లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హెచ్చరించారు. టెక్కలి మేజర్ పంచాయతీలోని శ్రీనివాస నగర్ ముంపు ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆక్రమణలు తొలగించి కాలువ నిర్మాణం చేపడతామన్నారు. ఆవుల సంరక్షణకు వంశధార స్థలంలో ఎకరా కేటాయించామని, అందులోకి పశువులను తరలించనున్నట్లు చెప్పారు. పట్టణానికి దూరంగా పందుల పెంపకదారులు వాటిని తరలించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు ఇచ్చిన స్థలాన్ని కాయగూరల మార్కెట్‌కు కేటాయించామని, ఇందిరాగాంధీ కూడలి నుంచి అంబేద్కర్ కూడలి వరకు రోడ్డుపై ఉన్న తోపుడుబళ్లన్నీ ఆ మార్కెట్‌కు తరలిస్తామన్నారు. రైతుబజారు నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులనూ పూర్తి చేస్తామని చెప్పారు. తొలుసూరుపల్లి రోడ్డులో కల్వర్టు నిర్మాణం చేపట్టి దుంపలచెరువుకు నీరు వెళ్లే విధంగా అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎన్.కృష్ణమూర్తి, తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఇఇ కె.వి.వి జగన్నాథరావు, మండల ఇంజినీరు ఎస్.వి నాయడు, ఎపిఒ బి.ప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పినకాన అజయ్ కుమార్, కె.లవకుమార్, కె.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సామాజిక ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నరసన్నపేట


ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు వివరాలు పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. రోగులకు వసతి, సౌకర్యాలు కల్పించాలని, ఒపి పెంచాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆస్పత్రి ప్రహరీ గోడ నిర్మాణానికి, దానికి ఆనుకుని ఉన్న కోవెలవీధి సిసి రోడ్డు, కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీరాజ్ ఇంజినీర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

దేశానికి వెన్నెముక యువత

ప్రజాశక్తి - కవిటి

దేశానికి వెన్నెముక యువతని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. అగ్నివీర్ ఎంపికల్లో భాగంగా దేశ సేవకు ఎంపికైన కొత్తపుట్టుగకు చెందిన నర్తు సింహాద్రి, కల్ల కృష్ణను గ్రామానికి చెందిన శ్రీ జగద్గురు యువజన సంఘం సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ యువత దేశ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశానికి సేవచేసే అవకాశం అందరికీ లభించిందని, లభించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సంతోష్, నాగరాజు, గ్రామ పెద్దలు ఎన్ సీతయ్య, అశోక్ పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని అరసవల్లికి చెందిన వడ్డి కళ్యాణికి సిఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే గొండు శంకర్ అందజేశారు. టిడిపి జిల్లా కార్యాలయంలో కళ్యాణికి గురువారం ఈ చెక్కును అందజేస్తూ ఎమ్మెల్యే మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన కళ్యాణి తన అనారోగ్యానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని తెలిపారు. ఇదే విషయాన్ని తనకు విన్నవించుకోగా కళ్యాణి ఆర్థిక పరిస్థితిని సిఎం చంద్రబాబుకు తాను వివరించినట్టు చెప్పారు. సిఎం స్పందించి రూ.1.5లక్షల చెక్కును మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా కళ్యాణి కుటుంబ సభ్యులు సిఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


రోగులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

రోగులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

స్థానిక జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్‌డిఒ ఎన్.కృష్ణమూర్తి ఆస్పత్రి వైద్యులకు సూచించారు. శుక్రవారం టెక్కలి జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఎమెర్జెన్సీ క్యాజువాలిటీతో పాటు వివిధ విభాగాలు, ఫార్మసీ, డయాలసిస్, ల్యాబ్‌లు పరిశీలించి రోగులతో మాట్లాడారు. రోగులు, మందుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని, పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావుకు ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది పనితీరు మార్చుకోవాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో పాటు వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



అవార్డు అందుకుంటున్న వెంకటేష్

వెంకటేష్‌కు డాక్టరేట్

టెక్కలి రూరల్: మండలం పోలవరం గ్రామానికి చెందిన దవళ వెంకటేష్‌కు చెన్నైలో జరిగిన గ్లోబల్ ఎచీవర్స్ కౌన్సిల్ అవార్డు కార్యక్రమంలో సౌత్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్సిటీ సోషల్ వర్క్‌లో భాగంగా గురువారం డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసింది. తాను చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి డాక్టరేట్ ప్రధానం చేయడం సంతోషంగా ఉందని, రానున్న రోజుల్లో మరింతగా సేవా కార్యక్రమాలు చేస్తానని వెంకటేష్ తెలిపారు. ఈ అవార్డుకు వెంకటేష్ ఎంపిక కావడంతో సర్పంచ్ గురువెల్లి బాలకృష్ణ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ విలన్ అవార్డుకు నాయక్ ఎంపిక



పలాస: అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఉత్తమ విలన్‌గా డాక్టర్ కుమార్ నాయక్ అవార్డు అందుకోనున్నారు. ఎవడి సినిమాకు వాడే హీరో చలన చిత్రంలో ప్రతి నాయకుని పాత్రలో విశేష ప్రతిభ కనబర్చినందుకు డాక్టర్.కుమార్ నాయక్‌కు ఉత్తమ విలన్ (బెస్ట్ నెగటివ్ రోల్)గా ఎంపిక చేశారని నాయక్ తెలిపారు. ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్ష కార్యదర్శులు హెచ్ఆర్. దిలీప్ కుమార్, పులగం రాజేంద్ర రెడ్డి, సెక్రటరీ ఫణీంద్ర ప్రసాద్ కమిటీ ఉత్తమ విలన్‌గా ఎంపిక చేస్తూ ఆహ్వానం పంపించారని ఈనెల 17 న జయదేవ్ భవన్, భువనేశ్వర్, ఒడిశాలో ఈ అవార్డును జాతీయ నటుల చేతులమీదుగా అందుకుంటానని తెలిపారు. అంత ర్జాతీయ చలన చిత్రోత్సవంలో అవార్డు రావడం ఆనందంగా ఉందని కుమార్ నాయక్ సంతోషం వ్యక్తం చేశారు.

రతన్ టాటా మృతి తీరని లోటు


పలాస : రతన్‌టాటా చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి - పలాస

రతన్ టాటా మృతి చెందడంతో టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గౌత శిరీష ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్గీయ రతన్ నావల్ టాటా చైర్మన్ ఎమిరైటస్, టాటా సన్స్, టాటా గ్రూప్ పద్మవిభూషణ్, పద్మభూషణ్, పరోపకారి, మనవతావాది ఇకలేరనే వార్త చాలా దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆయన లేని లోటు పారిశ్రామిక రంగానికి తీరని లోటన్నారు. ఆయన అకాల మరణం దేశానికే తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, టిడిపి నాయకులు పి విఠల్, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీను, టంకాల రవిశంకర్ గుప్తా, గాలి కృష్ణారావు, కొరికన శంకర్, వై.మోహనరావు, సాసుమాన చంద్రమౌళి పాల్గొన్నారు.

నరసన్నపేట : రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట టిడిపి కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాలతో నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నరసన్నపేట మండల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : దేశ ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని జోడించి అద్దిన అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని


నరసన్నపేట : నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి తదితరులు

వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పీజీ గుప్తా, జి.ఇందిరా ప్రసాద్, బి.వి.రవిశంకర్, శాసపు జోగినాయుడు అన్నారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో రతన్ టాటా మృతికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ మంతెన వాసుదేవాచారి, ఎండ మోహన్, పి.నాగేశ్వరరావు, పట్నాన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - నందిగాం

స్థానిక తపాలాశాఖ సబ్ పోస్టాఫీస్ కార్యాలయ ఆవరణలో తపాలా వారోత్సవాల సందర్భంగా గ్రామంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తపాలా శాఖలో ఉన్న వివిధ రకాల పథకాలు, తపాలాశాఖ అందిస్తున్న సేవలను టెక్కలి సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డివిఎన్ ప్రతాప్ కుమార్ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో నెలవారీ పొదుపు పథకాలు, ఇన్స్యూరెన్స్ పథకాలు, ఆధార్ నమోదు తదితర సేవలపై వివరించి, వాటిని వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో స్థానిక పోస్ట్‌మాస్టర్ కె.షణ్ముకరావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జనంలోకి మనం అనే కార్యక్రమంలో భాగంగా


నందిగాం : అవగాహన కల్పిస్తున్న ప్రతాప్‌కుమార్

(డాక్ చౌపల్) పట్టణంలో పోస్టల్ సబ్ పోస్ట్‌మాస్టర్ జ్ఞానవతి, సోంపేట సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నక్క శ్రీకాంత్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెయిల్ ఓవర్ సీర్ ఎస్.దీనబంధు, పోస్ట్‌మేన్ డేవిడ్ రాజు, కరణ్, రమేష్, మాధవ్ బెహరా, ధర్మరాజు, మన్మథ, మీరా తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పలాస

జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్, ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు ఆదేశాల మేరకు ఈ నెల 16న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరగబోయే నౌకరీ బనావ్ నిషా నహి చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు ఆస్పత్రిలో ఛలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం జయప్రదం అయ్యేలా కాంగ్రెస్ పార్టీ యువత ప్రత్యేక దృష్టి వహించాలని కోరారు. జీవితేశ్వరరావు మట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిరుద్యోగులపై అవలంభిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. మోడీ సర్కారు నిరంకుశ పాలనలో మాదకద్రవ్యాల వాడకం ఎక్కువ అవుతుందని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విషయంలో విఫలమైన సర్కార్‌ను ఎండగడుతూ ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తంగుడు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడను అరెస్టు చేయాలి

టెక్కలి: వైసిపికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఆయన ప్రియురాలు దివ్వల మాధురిని తక్షణమే తిరుపతి పోలీస్‌లు అరెస్టు చేయాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు బొకర నారాయణరావు ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుపతి దేవస్థాన ఆవరణలో మాధురి వెకిలి చేష్టలు మహిళా సమాజానికే అవమానకరంగా ఉన్నాయన్నారు. దేవస్థానం ప్రతిష్టని దిగజార్చిన మాధురి, శ్రీనివాస్‌లపై పోలీస్ కేసులు నమోదు చేసి తక్షణమే వారిని అరెస్టు చేసి పవిత్రతని కాపాడాలన్నారు. ఈయనతో పాటు మాధవరావు ఉన్నారు.

పోటీ పరీక్షలకు పుస్తకాలు సిద్ధం

టెక్కలి: స్థానిక గ్రంథాలయంలో వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని గ్రంథాలయాధాకారిణి బి.రూపావతి శుక్రవారం తెలిపారు. గ్రూప్స్, టెట్, డిఎస్‌సి, ఎపిపిఎస్‌సి వంటి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతో పాటు మోడల్ పేపర్‌లు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు, పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న వారు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

కళాజాతాకు ఆలి తిప్పలు నాటిక ఎంపిక

టెక్కలి: టెక్కలి ప్రజా చైతన్య కళాసమితి ఆధ్వర్యంలో రూపొందిన ఆలి తిప్పలు నాటిక ప్రపంచ కళాజాత నాటిక పోటీలకు ఎంపికైందని దర్శకులు దూసి ఆంధ్రాస్టాలిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెం బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 19న ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు ప్రపంచ తెలుగు సాహితీ కళా జాత చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారని స్టాలిన్ తెలిపారు. ఈ ప్రదర్శనకు తనతో పాటు నాటక రచయిత, నటుడు, మూల తాతయ్య, జానపద కళాకారుడు డాక్టర్ కుమార్ నాయక్, బాలనటుడు గౌడు వేదవ్యాస్‌లతో పాటు ప్రధాన పాత్రదారులు కూడా హాజరు కానున్నారని తెలిపారు. ప్రపంచ కళాజాత నాటక పోటీలకు ఆలితిప్పలు నాటిక ఎంపిక కావడంపై ప్రజా చైతన్య కళాసమితి నిర్వాహకులు చిలుకు కృష్ణారావు, ఉత్తరకవాటం గణపతి, రామముని రమేష్, మల్లారెడ్డి పద్మనాభం, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామ చంద్రరావు, సాహితీ సమాఖ్య అధ్యక్షులు అయ్యబాబు తదితరులు అభినందించారు.

బాబూరావుకు సన్మానం

పలాస: ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావుకు శుక్రవారం ఆయన స్వగృహంలో కాశీబుగ్గ ప్రముఖ వైద్యులు పొందల జగదీష్, బెందాళం కాళింది, స్టేట్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు, జీడి కార్మికుల సంఘం అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, బి.సింహాచలం, రాము, నాగేశ్వరరావు, విశాఖ కో- ఆపరేటివ్ బ్యాంకు అధికారులు సన్మానించారు.

బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి వాహన సేవ, సూర్య ప్రభ వాహనం, చంద్ర ప్రభ గురువారం ఉదయం, రాత్రి స్వామివారి వాహన సేవల్లో సాంప్రదాయ కూచిపూడి నాట్య ప్రదర్శనలో ఇచ్ఛాపురం నాట్య కళాకారులు ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణాలయం కళాకారుల నాట్య ప్రదర్శనలో పాల్గొన్నారు. నాట్య కళాకారుల బృందం నాట్య గురువు మంగి దివ్య ఆధ్వర్యంలో కళాకారులు నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అధ్యక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మంగి దాలమ్మ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో కళాకారులు నాట్య ప్రదర్శనలు చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు.


నాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు


సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

దసరా ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

పాతపట్నం: నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం వద్ద శనివారం జరగనున్న దసరా ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, వాహన పూజల కోసం ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఏర్పాట్లు, తాగునీరు ఏర్పాట్లును పరిశీలించారు. కొత్తూరు, పాతపట్నం సిఐలు, ఎస్ఐలు, ఆలయ ఇఒలతో కలిసి పరిశీలించారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా ట్రాఫిక్ నియంత్రణలో పోలీస్ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. ఈయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, పట్టణ అధ్యక్షులు సైలాడ సతీష్, సన్యాసి, దుర్గా ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విమర్శలు మానుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: విజయవాడ వరదల సందర్భంగా తమ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు చేసిన సహాయం ప్రపంచం మొత్తం పొగడ్తలతో ముంచెత్తుతుంటే వైసిపి నాయకులు బురద చల్లే కార్యక్రమాలను ఇప్పటికీ చేస్తుండడం అన్యాయమని, వారు విమర్శలు మానుకోకపోతే తగురీతిలో బుద్ధి చెబుతామని ఎమ్మెల్యే గౌతు శిరీష హెచ్చరించారు. టిడిపి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అక్కడి ప్రజలకు అందించిన సేవలు వైసిపి నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. వైసిపి హయాంలో వరదల సమయంలో పరదాలు, హెలీకాప్టర్ సంస్కృతి ఉండేదని, నేడు సిఎం చంద్రబాబునాయుడు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి సహాయం చేస్తున్నారన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ బొమ్మల కోసం రూ.13 కోట్లు, మద్యం షాపుల్లో ఎలుకలు పట్టుకోవడానికి రూ.1.5 కోట్లు ఖర్చుచేసినట్లు లెక్కలు చూపించారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

కోర్టు భవనాలకు చొరవ చూపాలి

నౌపడ: ఎపి హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పని చేస్తున్న మెండ లక్ష్మీనారాయణను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకనంద, కార్యదర్శి ఎస్.దివాకరరావు, న్యాయవాదులు సాయిరాజు, ఆనంద్ సంతబొమ్మాళి మండలం ఆయన స్వగ్రామం కృష్ణ చంద్రపురం వెళ్లి అభినందనలు తెలియజేసి దుశ్శాలువతో సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వివేకానంద మాట్లాడుతూ టెక్కలిలో నూతన కోర్టు భవనాలు ఆవశ్యకతను తెలియజేశారు. నూతన భవనాలకు అవసరమైన అనుమతులను నిధులు మంజూరు చేయుటకు తనవంతు కృషి చేయాలని కోరారు.

స్పందన ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలం బడేకుప్పన్న పేట కార్యస్థానంగా పనిచేస్తున్న కె.పి.స్పందన ఫౌండేషన్ శుక్ర వారం కోటబొమ్మాళి మండలం సోమనాథపురానికి చెందిన బొడ్డాపు సహదేవ్‌కు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. నిరుపేదైన సహదేవ్ గత మూడు నెలలుగా మొండి చర్మ వ్యాధితో బాధపడుతూ తిండి లేక వైద్యం చేయించుకునే స్థోమత లేక తీవ్ర మనోవేదనకు గురై 38 కేజీల బరువుకు తగ్గిపోయాడు. అదే గ్రామానికి చెందిన రామారావు అనే యువకుడు చొరవ తీసుకొని వివరాలు స్పందన ఫౌండేషన్‌కు పంపి సహాయం కోరగా సభ్యులు సత్వరమే స్పందించి శ్రీకాకుళంలోని లింగాల రమేష్ అనే చర్మవ్యాధి నిపుణుని వద్దకు సిఫార్సు చేసి 3 నెలలకు 4 రకాల మాత్రలు, 3 రకాల ఆయింట్‌మెంట్‌లు, సబ్బులు, బూస్టు, పోషకాహార పదార్థాలు మొత్తం


ఆర్థికసాయం అందజేస్తున్న షణ్ముకరావు

రూ.10వేల మందులు అందించారు. ప్రస్తుతం 20 రోజుల్లో 50శాతం తగ్గిందని త్వరలోనే కోలుకుంటానని సహదేవ్ తెలిపారు. ఈ మొత్తాన్ని టెక్కలికి చెందిన దుంప చంద్రశేఖర్, ఎన్.సింహాచలం, ఇతర స్పందన సభ్యులు సమకూర్చారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు షణ్ముకరావు, సిమ్మన్న, రామారావు పాల్గొన్నారు.


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నేత్రాలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరముందని లైన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డా. బొడ్డేపల్లి సురేష్ అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సత్యసాయి అన్నదాన ప్రాంగణ ఆవరణలో క్లబ్ ఆధ్వర్యాన ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ సమస్యలపై ప్రజలను అవగాహన కల్పించి వీలున్నంత మందికి మెరుగైన కంటిచూపును అందించడమే తమ లక్ష్యమన్నారు. ఒమేగా - 3 ప్యాటీ యాసిడ్స్ లభించే చేపలను ఎక్కువగా తినాలన్నారు. నేత్ర దానం వలన మరొకరికి చూపు నందించిన వారవుతారని, ప్రతిఒక్కరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. నటుకుల మోహన్, పొన్నాడ రవి కుమార్, డాక్టర్ పొన్నాడ శేషుబాబు, బాడాన దేవ భూషణ్, టెక్కం రాంగోపాల్, గుత్తు చిన్నారావు పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న ఎమ్మెల్యేలు


పోలాకి : దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలం ఇన్నేసుపేట గ్రామ చావిడి వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే బెందాలం అశోక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, మాజీ ఎఎంసి సహదేవ్, కామేశ్వరరావు, నరేంద్ర రెడ్డి, సారథి, శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు..


పోలాకి : మండలంలో పలు గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గుల్లవానిపేట, గుప్పెడుపేట దీర్ఘాశి, పోలాకి గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాలను సందర్శించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో పోలాకి మండల టిడిపి అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, రాంబాబు, భాస్కరరావు, కె.రమేష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం ఓం శాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. అలాగే ఉత్సవాలకు తనవంతు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. మండలంలోని బగదళ, గురండి గ్రామాల్లో సరస్వతీ దేవి వార్షికోత్సవ కార్యక్రమాలకు భగదల గ్రామానికి రూ.15 వేలు, గురండి గ్రామానికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎంపిపి తూలుగు తిరుపతిరావు, టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి, ఎంఇఒ మడ్డు వెంకటరమణ, చత్రపతి మాస్టారు, సిర్ల ప్రభాకరరావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న మాజీ మంత్రి

కోటబొమ్మాళి: శ్రీ కొత్తమ్మతల్లిని మాజీమంత్రి, టిడిపి సీనియర్ నాయకులు గౌతు శ్యామసుందర శివాజీ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ స్వాగతం పలకగా వేదపురోహితులు సుసరాపు గణపతిశర్మ, లక్ష్మీకాంతం శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల టిడిపి అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ, టిడిపి పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్‌పి బర్ల ప్రసాదరావు కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు.

ఆమదాలవలస : మండలంలోని సైలాడలో ఎంఎస్ఎస్ యూత్ ఏర్పాటు చేసిన దుర్గాదేవి ఉత్సవాల్లో జనసేన పార్టీ నాయకులు కోరుకొండ మల్లేశ్వరరావు పాల్గొన్నారు. దుర్గాదేవి విగ్రహాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా పార్టీ కార్యదర్శి అంబాల కోటేశ్వరరావు, జోగి చందు మనోహర్, సైలాడ పాపినాయుడు, హరిబాబు, ఉదయ్, నాగరాజు, శ్రీను, రవితేజ, రాజు తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అశోక్

యువకుని అవయవదానం

పాతపట్నం: ఒరిస్సా గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన నరేష్ పట్నాయక్ అనే యువకుడు ఇంట్లో ప్రమాదానికి గురై విశాఖపట్నం ఆస్పత్రిలో గురువారం మృతి చెందారు. ఆయన అవయవాలను ప్రభుత్వానికి కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భంగా మృతదేహాన్ని విశాఖపట్నం నుంచి పాతపట్నం తీసుకువచ్చి పాతపట్నం నుంచి పర్లాకిమిడి వరకు ర్యాలీగా తీసుకువెళ్లారు. మృతదేహంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, నాయకులు, ప్రజలు ర్యాలీగా వెళ్లి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

నాటుసారాతో పది మంది అరెస్టు

పాతపట్నం: స్థానిక ఎస్ఐ బి.లావణ్య తన సిబ్బందితో శుక్రవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా లావేరు మండలం మురపాకకు చెందిన ఆరుగురు వ్యక్తులు 15 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డారు. పాతపట్నంకు చెందిన నలుగురు వ్యక్తులు నాలుగు లీటర్ల సారా తరలిస్తూ పట్టుబడ్డారు. 19 లీటర్ల నాటు సారాతో పదిమందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రెండు కేసుల్లో పది మందికి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

దివ్వల మాధురిపై కేసు నమోదు

టెక్కలి రూరల్: టిటిడి నిబంధనలు, సాంప్రదాయాలను ఉల్లంఘిస్తూ దువ్వాడ శ్రీనివాస్‌తో సహజీవనం చేస్తున్న వ్యక్తిగత విషయాలను తెలుపుతూ తిరుమలలో సోషల్ మీడియాలో రీల్స్ ప్రచురించడంతో దివ్వెల మాధురిపై టిటిడి అధికారులు ఫిర్యాదు మేరకు తిరుపతి పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీవారి ఆలయ ప్రాంగణం, పుష్కరిణిలో రీల్స్ షూట్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మాధురి వ్యవరించదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాధురిపై 292, 296, 300 BNS Sec 66(E) IT Act 2000–2008 కింద కేసు నమోదు చేశారు.

క్రీడాకారులకు అభినందనలు

టెక్కలి: ఇటీవల అన్నవరంలో జరిగిన జూనియర్ బాల్ బ్యాడ్మింటెన్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులను టెక్కలి సుమిత్ర సేవా పౌండేషన్ నిర్వాహకులు శుక్రవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ఎస్.కిరణ్, పి.భవానీ, యోగి, శివశంకర్‌లను అభినందించారు. క్రీడాకారులను అభినందించిన వారిలో సుమిత్రా సేవా పౌండేషన్ అధ్యక్షులు కోరాడ రాంప్రసాద్, యోగా కేంద్ర నిర్వాహకులు గేదెల చంద్రశేఖర్, దేవాది శ్రీనివాస్, డాక్టర్ మహరాజ్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న పరమేశ్వరరావు

పిజి కోర్సులకు అనుమతులు

టెక్కలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా విభాగంలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు పీజీ విభాగంలో సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు డబ్ అనుమతులు లభించాయని ప్రణవి డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఇప్పటికే పీజీ, యూజీ, ఆర్ట్స్ విభాగంలో ప్రవేశాలు జరుగు తున్నాయన్నారు. ఎంఎస్‌సి గణితం, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, బోటనీ, కంప్యూటర్స్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ తదితర కోర్సులకు అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 30 చివరి తేదీ అని తెలిపారు. కోర్సు ఫీజు తదితర వివరాల కోసం 9908297992, 7337256124, నెంబర్లను సంప్రదించాలని పరమేశ్వరరావు తెలిపారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, ప్రిన్సిపాల్ కె.రుక్మాంగదరావు, పాల్గొన్నారు.



పతకాలతో విద్యార్థులు

సత్తాచాటిన తైక్వాండో క్రీడాకారులు

టెక్కలి : ఈ నెల 6, 7, 8 తేదీల్లో తిరుపతిలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా తైక్వాండో పోటీల్లో పాల్గొన్న టెక్కలి ఎన్‌టిఆర్ క్రీడా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు కోచ్ నర్సిపురం శేఖర్ శుక్రవారం తెలిపారు. అండర్ 14 బాలికల 29 కేజీల విభాగంలో మెండ తపస్వి స్వర్ణ పతకం, అండర్ 17 బాలికల 55 కేజీల విభాగంలో పులిబంద జాస్విక స్వర్ణ పతకం సాధించింది. బాలుర అండర్-14 29 కేజీల విభాగంలో ఎస్.మోహిత్ రజత పతకం సాధించారు. వీరిని డిఎస్‌డిఒ కళ్లేపల్లి శ్రీధర్, కోచ్ శేఖర్ అభినందనలు తెలిపారు. టీం మేనేజర్లు పడాల అక్షా, తాస్వి హర్షం వ్యక్తం జేశారు.

బైపల్లిలో అన్నదానం

వజ్రపుకొత్తూరు: మండలం బైపల్లి లో శుక్రవారం రెండు వేల మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భజన కళాకారులు భక్తి గీతాలతో ప్రజలను అలరించారు. కమిటీసభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.